క్లుప్తంగా

నూతన భవనం నిర్మించాలి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో మెట్‌పల్లి పంచాయతీలోని బీరసాగర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు వచ్చిందని కలెక్టర్ స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిలా కార్యదర్శి కుమ్మరి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం కూలిపోయే పరిస్థితుల్లో ఉందన్నారు. నూతన భవనాన్ని నిర్మించకుండా మళ్లీ మరమ్మతులు చేస్తున్నారని వాపోయారు. తక్షణమే నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు తరుణ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన జెడ్పీటీసీ



టేకుమట్ల: వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి శుక్రవారం హనుకొండలోని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట టేకుమట్ల మాజీ సర్పంచ్ పాలాల సరోత్తంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆడెపు సంపత్, తదితరులు ఉన్నారు.

ట్రెయినీ ఐఏఎస్‌లతో హరిత హోటల్ బృందం



కాళేశ్వరం: తెలంగాణ క్యాడర్‌కు చెందిన 2023 ఐఏఎస్‌ల బృందం సభ్యులు కాళేశ్వరంలో గురువారం బస చేశారు. శుక్రవారం స్థానిక హరితహోటల్ సిబ్బంది మర్యాదపూర్వకంగా వారికి హోటల్ మేనేజర్ జక్కం సురేష్‌తో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ట్రైయినీ ఐఏఎస్‌లు హోటల్‌లో వసతులు బాగున్నాయని సిబ్బందికి అభినందనలు తెలిపారు.

'రాజకీయ సన్యాసానికి సిద్ధమా?'



కాటారం: కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు, యువనాయకుడు శ్రీనుబాబుపై పుట్ట మధు చేస్తున్న ఆరోపణలు నిరూపించకుంటే రాజకీయ సన్యాసానికి సిద్ధమా అని మండల కాంగ్రెస్ నాయకులు సవాలు విసిరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో నేర ఆరోపణలు ఉన్న భవానీసేన్‌ను బీఆర్ఎస్ అధికారంలో ఉండగా మహదేవపూర్ రెండో ఎస్సైగా తీసుకొచ్చింది పుట్ట మధు కాదా అని ప్రశ్నించారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబుపై పుట్ట మధు, బీఆర్ఎస్ నాయకులు బురద జల్లె ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు తెప్పెల దేవేందర్ రెడ్డి, అంగజాల అశోక్, గద్దల రమేశ్, కుంభం రమేశ్‌రెడ్డి, కోడి రవి, తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో కాడెద్దు మృతి



టేకుమట్ల: పాము కాటుతో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని గర్మిళ్లపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత రైతు అరికాంతపు రాజయ్య కథనం ప్రకారం రోజువారిలాగే ఇంటి ముందు గల పశువుల కొట్టంలో కట్టేసిన కాడెద్దును పాము కాటేసిందని ఉదయం 9గంటలకు కాడెద్దు అపస్మరణ స్థితికి చేరుకుని మృతి చెందినట్లు తెలిపారు. కాగా, కాడెద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలని వేడుకున్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె..

కాటారం: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని మేడిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గడవేన కొమురయ్యకు చెందిన గేదె పశుగ్రాసం కోసం గ్రామ శివారులోని పొలాల్లోని వెళ్లింది. ప్రమాదవశాత్తు కిందకు వేలాడి ఉన్న ప్రధాన విద్యుత్ తీగను తాకి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం, అధికారులు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

మల్హర్: మల్లారంలో యోగా చేస్తున్న ఎంపీపీ, తదితరులు



భూపాలపల్లి రూరల్: జయశంకర్ పార్కులో..



మొగుళ్లపల్లి: రంగాపురంలోని ఈజీఎస్ పని ప్రదేశంలో..



యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

మల్హర్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, తాడిచర్ల జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ ప్రవీణ్, యోగా గురువులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకోని మండలంలోని తాడిచర్ల, వల్లెకుంట, మల్లారం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ఖాళీ ప్రదేశాల్లో యోగ దినోత్సవ వేడకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువకులు, స్థానికులచే యోగాసనాలు వేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యోగా వల్ల కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాల గురించి చైతన్యం కలిగించడమే అంతర్జాతీయ యోగా దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రకాశ్‌రావు, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, బీజేపీ మంథని నియోజక వర్గ అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్ రావు, మండల అధ్యక్షుడు ముడుతనపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: ప్రపంచ యోగ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఆ పార్టీ అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి హాజరై యోగ ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగా వల్ల ఉపయోగాలు వివరించారు. అదేవిధంగా హార్ట్ ఫుల్‌స్ యోగ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ నిర్వహకులు రవీందర్, మాధవి యోగా శిక్షకుడు లక్ష్మణ్ జయశంకర్‌పార్కులో మార్నింగ్ వాక్ చేసేవారికి యోగాసనాలు, మెడిటేషన్, ప్రాణాయామం గురించి వివరించారు. వారితో యోగాసనాలు చేయించారు. అనంతరం యోగా నిర్వహకులు రవీందర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మనిషి అనేక ఒత్తిడిలకు గురవుతున్నారని తద్వారా జబ్బులు వస్తున్నాయని వీటినుంచి బయటపడడానికి యోగ ఎంతో ఉపకరిస్తుందని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని జీఎం కార్యాలయం ఎదుట ఉన్న హార్ట్ ఫేల్‌నెస్ కేంద్రంలో ఉచితంగా యోగా, ధ్యానంలో శిక్షణ ఇప్పించడం జరుగుతుందని ఆసక్తి గలవారు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో బాలరాజు, సమ్మయ్య, స్వామి, పద్మ, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు



భూపాలపల్లి రూరల్: యోగాసనాలు చేస్తున్న కీర్తిరెడ్డి, నాయకులు

మొగుళ్లపల్లి: మండలంలోని, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో, ఈజీఎస్ పని ప్రదేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హుస్సేన్ మాట్లాడుతూ.. యోగా చేయడం వలన మానసిక ప్రశాంత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీరస్వామి, డాక్టర్ నాగరాణి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో 10వ ఇంటర్నేషనల్ యోగా దివాస్ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీధర్ ఆధ్వర్యంలో యోగా సాధన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. నేటి మానసిక ఒత్తిడితో కూడిన జీవన విధానానికి నిత్య ధ్యాన సాధనయే పరిష్కార మార్గమని అన్నారు. ధ్యానంతో పాటు ప్రాణామయం, ఆసనాలు నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు

జూనియర్ కళాశాలలో..

మహాదేవపూర్ మండలం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.రమేష్ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా డే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వివిధ రకాల యోగా ఆసనాలు వేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.సరిత మాట్లాడుతూ.. యోగాను ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగస్వామ్యం చేసుకోవాలని తెలిపారు. అధ్యాపకులు సదాశివ్, సమ్మయ్య, సదానందం, విజయ రామారావు, శ్వేత, రమాదేవి, పిన్నయ్య, పోచయ్య, నాన్ టీచింగ్ స్టాఫ్ లక్ష్మణ్, రాజయ్య పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయలంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ గుడాల అరుణ, ఏపీఓ కే.రమేష్, ఐకేపీ ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.



కాళేశ్వరంలో..

యోగాతో మానసిక ప్రశాంతత

చిట్యాల: యోగాతో మానసిక ప్రశాంత కలుగుతుందని జిల్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘుపతి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని జూకల్ ఉన్నత పాఠశాల, కాకతీయ హైస్కూల్, రైజింగ్ సన్, స్కూల్, శ్రీవివేకాంనంద స్కూల్, శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో యోగా దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లిలో..



మొగుళ్లపల్లి పాఠశాలలో..

రేగొండ: యోగాతో మానసిక ప్రశాంత వతావరణం ఉంటుందని బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ కో-కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, నాయకులు నాయకులు సరోత్తం రెడ్డి, లింగారెడ్డి, బుచ్చిరెడ్డి, రఘు, సురేందర్ రెడ్డి, రవీందర్, రాజయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలోని ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



కాళేశ్వరం: ఎంపీడీఓ కార్యాలయంలో..



మొగుళ్లపల్లి: పీహెచ్‌సీలో..



మొగుళ్లపల్లి: పీహెచ్‌సీలో..

జీపీ సిబ్బందికి పరికరాల పంపిణీ



భద్రత పరికరాలను అందజేస్తున్న ఎంపీఓ సురేష్

టేకుమట్ల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి భద్రతా పరికరాలను శుక్రవారం ఎంపీఓ సురేష్, ఎంపీటీసీ ఆది సునీత రఘు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది ఎంతో శ్రమకోర్చి పని చేస్తున్నారని అన్నారు. పనితో పాటు వారికి భద్రత కుడా ముఖ్యం అన్నారు. ఈ మేరకు డీపీఓ ఆదేశాల మేరకు సిబ్బందికి భద్రత పరికరాలను అదజేసినట్లు తెలిపారు. అలాగే పంచాయతీ కార్యదర్శి సాంబశివుడు మాట్లాడుతూ.. ప్రతి నెల ఒకటవ తేదీన పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు చేతులు శుభ్రం చేసుకోవాడానికి సబ్బులు ఇచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



వ్యక్తిని కాపాడుతున్న కానిస్టేబుల్ నవీన్

చిట్యాల: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి రోడ్డుపై పడడంతో అటుగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు నవీన్, లింగన్నలు అతడిని చూసి స్థానిక సివిల్ ఆస్పత్రి చేర్పించి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన సింగరేణి ఉద్యోగి జొన్నల లింగయ్య వ్యక్తి గత శుక్రవారం పని మీద ద్విచక్రవాహనంపై జమ్మికుంటకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మండల కేంద్రంలోని గ్యాస్ గోదాం వద్ద అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు వాహనంపై పడిన వ్యక్తిని కాపాడి అతడిని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి ప్రాణాలను కాపాడిన పోలీసులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహాముత్తారం: మహాముత్తారం సబ్‌స్టేషన్ పరిధిలో నేటి(శనివారం) నుంచి వారం రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ బి.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ, గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్‌ను అందించడం కోసం సబ్ స్టేషన్‌లో రెండవ 33/11 కేవీ పవర్ ట్రాన్స్ఫర్మర్, 11 కేవీ బ్రేకర్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రోజుకూ మూడు గంటలు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించగలరని కోరారు.

జయశంకర్ సార్‌కు ఘన నివాళి



కాళేశ్వరం: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల జూనియర్ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ కోసం జయశంకర్ చేసినటువంటి ఉద్యమానికి సంబంధించిన విషయాలను విద్యార్థులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ ప్రవీణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి రవీందర్, అధ్యాపకులు వెంకట్ రెడ్డి, కరుణాకర్, నరేష్, రమేశ్, భరత్‌రెడ్డి, రవి, జైపాల్, ఉమామహేశ్వరి, కార్యాలయం సిబ్బంది రవి, షబ్బీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తొలితరం ఉద్యమకారుడు వామన్‌రావు, అయూబోద్దీన్, దేవేందర్, ప్రభాకర్, అక్రమ్, రమేష్, గట్టయ్య, ప్రవీణ్, రవి, పోచం, అశోక్, ధర్మయ్య, మహేష్, ఐలయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, దుర్గయ్య పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయశంకర్ వర్ధంతిని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.రమేష్, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.సరిత పాల్గొన్నారు.



మల్హర్: జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

గుడుంబా స్థావరాలపై దాడులు

గణపురం: మండలంలోని గొల్లపల్లి, బస్వరాజుపల్లి గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై గణపురం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడిగా శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబాతో పాటు, గుడుంబా తయారీకి ఉపయోగించే 600 లీటర్ల ముడి సరుకును ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి పాల్పడిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో గణపురం ఎస్సై మచ్చ సాంబమూర్తి, ఎక్సైజ్ సీఐ ఎం.సుధీర్, ఎస్సై లింగాగౌడ్ తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండలంలోని పాశిగడ్డతండా గ్రామంలో శుక్రవారం స్థానిక పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు చేసి 25 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, 150 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గ్రామానికి చెందిన జరుపుల రమేశ్, లావుడ్య సునీత, రాములు, సరోజన ఇంట్లో అక్రమంగా గుడంబాను తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు వారిని పట్టుకుని ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించిన ట్లు తెలిపారు. ఈ దాడుల్లో సెకండ్ ఎస్సై శాఖాన్, పోలీస్ సిబ్బంది అస్లాం జానీ, లింగన్న, ప్రశాంత్, శ్రావణి, లలిత, నవీన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కాటారం/మహాముత్తారం/మల్హర్: గుడుంబా నిర్మూలన స్పెషల్ ప్రోగ్రామ్‌లో భాగంగా కాటారం సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, పోలీసులు సంయుక్త దాడులు నిర్వహించారు. కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లింగాచారి ఆధ్వర్యంలో పలిమెల, సర్వాయిపేట, అడ్వాలపల్లి, గాదంపల్లి, కొత్తపల్లి, బోర్లగూడెం, రెడ్డిపల్లి, పెగడపల్లి, పంకెన గ్రామాల్లోని గుడుంబా తయారి కేంద్రాలపై విస్తృతంగా దాడులు జరిపారు. ఆయా గ్రామాల్లో 3300 లీటర్ల చక్కెర పానకం, తయారీ సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు 66 లీటర్ల గుడుంబా, 10 కిలోల బెల్లం, 5 కిలోల పటికను స్వాధీనపర్చుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. 14 కేసులు నమోదు చేసి 13 మంది గుడుంబా తయారీ దారులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. బెల్టుషాపులపై దాడులు చేసి 2.16 లీటర్ల మద్యం, 3.25 లీటర్ల బీర్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సివిల్ సీఐలు నాగార్జునరావు, రాజేశ్వరరావు, డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య, ఆయా మండలాల సివిల్ ఎస్సైలు పవన్‌కుమార్, నరేశ్, మహేందర్‌యాదవ్, తమాషారెడ్డి, సిబ్బంది శ్రీకాంత్, కోటేశ్వర్, వెంకట్‌రాజ్, సునీల్ పాల్గొన్నారు.

టేకుమట్ల: గుడుంబాను ఎవరైనా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో గుడుంబా విక్రయిస్తున్న ఇళ్లల్లో ఉదయం సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సొతుకు లక్ష్మి వద్ద 10 లీటర్లు, గిద్దెముత్తారం నుంచి గర్మిళ్లపల్లి వైపు వస్తున్న లంబడి తండాకు చెందిన బానోతు సారయ్య అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల గుటుంబాను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ పోలీసులకు అందించారు. ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రమేష్, చంద్రశేఖర్, కానిస్టేబుల్ సుమన్, నాగరాజు, రాజేందర్, హోంగార్డులు, మొగిళి, గంగరాజు, రాజయ్య ఉన్నారు.



చిట్యాల: గుడుంబా స్వాధీనం చేసుకున్న పోలీసులు



మల్హర్‌లో..

రేగొండ: మండలంలోని రామన్నగూడెం తండాలో శుక్రవారం ఎస్సై రవికుమార్, ఎక్సైజ్ శాఖ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 400 లీటర్ల బెల్లం పానకం, రెండు లీటర్ల గుడుంబా దొరికినట్లు పేర్కొన్నారు.

మొగుళ్లపల్లి: గుడుంబా స్థావరంపై చిట్యాల సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో దాడి చేసి 20 లీటర్ల గుడుంబాను పట్టుకోని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేష్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ముల్కలపల్లి గ్రామ శివారులో గుడుంబా కాస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ముల్కలపల్లి గ్రామానికి చెందిన మిరియాల పల్లవేని కేతమ్మ, గట్టు సంధ్య, అల్లకోండ ఈశ్వరమ్మ కాస్తున్న గుడుంబా స్థావరంపై దాడి చేసి 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 20 లీటర్ల గుడుంబాను స్వాదీనం చేసుకోని ముగ్గరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఏటూరునాగారం: అనుమానితులకు ఆశ్రయం కల్పించవద్దని సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బూటారం గ్రామాన్ని సీఐ, ఎస్సైలు తనిఖీ చేసి గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గిరిజనులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం మొదలైందని విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని గిరిజనులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొంతమంది వారి స్వార్థ ప్రయోజనాల కోసం గ్రామాల్లో చొరబడి తలదాచుకునే ప్రయత్నం చేస్తారని అలాంటి వారికి ఆశ్రయం కల్పించవద్దన్నారు. అలాంటి వారిని గుర్తించి తమకు సమాచారం అందించాలని తెలిపారు. గిరిజన గ్రామాల ప్రజలకు మేము అండగా ఉంటామన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులతోపాటు స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

చిట్యాల: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2017-18 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు చదువుకున్న సమయంలో వారి తీపి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి సుమలత, పూర్వ విద్యార్థులు కీర్తి, ప్రవళిక, చందన, రమ్య, అనూష, నాగలక్ష్మీ, సృజన, కవిత పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410